# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 28-09-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **హైదరాబాదులో ఈరోజు జరిగే నల్సార్ విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మ్ ముఖ్య అతిథిగా పాల్గొంటారు.**
2. **పర్యాటక రంగం మానవత్వ బంధాలను పెంపొందిస్తుందని ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్ అన్నారు.**
3. **తిరుమల సందర్శించే ఎవరైనా అక్కడి నిబంధనలను పాటించ వలసిందేనని ఆంధ్ర ప్రదేశ్ ముఖ్య మంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.**
4. **తెలంగాణా ప్రాంతంలో చారిత్రక భవనాలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చి దిద్దుతామని ముఖ్య మంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలిపారు.**
5. **తెలంగాణా రాష్ట్రంలోని ఛండ్లాపూర్.., పెంబర్తి గ్రామాలకు జాతీయ పర్యాటక పురస్కారాలు లభించాయి.**

==========================

భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మ్ ఈరోజు హైదరాబాదు నగరంలో పర్యటిస్తారు. మేడ్చల్ జిల్లా శామీర్ పేట పరిధిలోని నల్సార్ విశ్వవిద్యాలయ 21వ స్నాతకోత్సవ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొంటారు. రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ...., నల్సార్ చాన్సలర్, హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరాదే కూడా ఈ కార్యక్రమానికి హాజరవుతారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో నగరంలో ఈరోజు ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేస్తున్నామని నగర పోలీసులు ప్రకటించారు.

--------------------------

పర్యాటకం మానవత్వ బంధాలను ఏర్పరుస్తుందనీ, ప్రస్తుతం ఇది చాలా అవసరమని భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ పేర్కొన్నారు. నిన్న ఢిల్లీలో జరిగిన ప్రపంచ పర్యాటక దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ శాంతి స్థాపనకు పర్యాటకం పెద్దఎత్తున దోహదపడుతుందనీ, ప్రపంచం మొత్తం శాంతి కోసం ఎదురుచూస్తోందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సంవత్సరం ప్రపంచ పర్యాటక దినోత్సవ ఇతివృత్తం "పర్యాటకం మరియు శాంతి" గొప్ప ఔచిత్యాన్ని కలిగి ఉందని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు.

--------------------------

తిరుమలకు వెళ్ళాలంటే ఎవరైనా అక్కడి ఆచారాలు ..., నియమాలు పాటించ వలసిందేనని ఆంధ్రప్రదేశ్

ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. వెలగపూడి సచివాలయంలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ .... ఆచారాలు పాటించకపోతే భక్తుల మనోభావాలు దెబ్బతింటాయని అన్నారు. భక్తులు పవిత్రంగా భావించే క్షేత్రాన్ని రక్షించవలసిన బాధ్యత మనపై ఉందని అన్నారు. సొంత మతం ఆచారాలను పాటించాలని, అదే సమయంలో ఇతర మతాలనూ గౌరవించాలని పేర్కొంటూ...

.....వాయిస్.... 25 సెకన్లు....

ఇదిలా ఉండగా .... ఈరోజు తలపెట్టిన తిరుమల పర్యటనను రద్దు చేసుకున్నట్లు మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జగన్ మోహన రెడ్డి తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ప్రతి గ్రామంలోనూ అభివృద్ధి పనులను అక్టోబర్ 14వ తేదీ నుండి ప్రారంభించాలని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ పంచాయతీలను ఆదేశించారు. పంచాయతీరాజ్ ..., గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులతో నిన్న అమరావతిలో జరిగిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ... రాష్ట్రంలో కూటమి పాలన మొదలైన తొలి వంద రోజులలోనే 15వ ఆర్థిక సంఘం నుండి 1987 కోట్ల రూపాయలు ..., ఎన్.ఆర్.ఈ.జి.ఎస్. ద్వారా 4 వేల 5 వందల కోట్ల రూపాయల మేర నిధులు కేంద్ర ప్రభుత్వం నుండి అందినందున నిధుల సమస్య ఉత్పన్నం కాదని అన్నారు. అక్టోబర్ 14వ తేదీ నుండి ప్రతి పంచాయతీలో అభివృద్ధి పనులు ప్రారంభించాలని పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు.

---------------------------

ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పురస్కారాల జాబితాలో తెలంగాణా రాష్ట్రంలోని రెండు గ్రామాలకు స్థానం దక్కింది. వాటిలో ఒకటి సిద్దిపేట జిల్లాలోని చంద్లాపూర్ కాగా .... మరొకటి జనగాం జిల్లాలోని పెంబర్తి గ్రామం. ఈ రెండు గ్రామాలు జాతీయ ఉత్తమ "టూరిజం విలేజ్" పురస్కారాలకు ఎంపికయ్యా యి. చంద్లాపూర్ గ్రామం వద్ద కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన రంగనాయక సాగర్ రిజర్వాయర్ ఉంది. ఈ రిజర్వాయర్ మధ్యలో ఉన్న ద్వీపం అద్భుతమైన పర్యాటక ప్రాంతంగా భాసిల్లుతోంది. ఇక్కడి ప్రకృతి అందాలు తెలంగాణా సంస్కృతిని ప్రతిబింబిస్తాయి. మరొక వైపు ... ఇత్తడి ..., కంచు కళాకృతులకు నిలయమైన పెంబర్తి గ్రామం నుండి విదేశాలకు సైతం ఈ వస్తువులు ఎగుమతి కావడం విశేషం. డిల్లీలో నిన్న జరిగిన ఒక కార్యక్రమంలో ఉప రాష్ట్రపతి జగ్ దీప్ ధన్‌ఖడ్ నుండి ఆయా గ్రామాల అధికారులు ఈ పురస్కారాలను అందుకున్నారు.

---------------------------

తెలంగాణా ప్రాంతంలో చారిత్రక భవనాలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చి దిద్దుతామని ముఖ్య మంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రకటించారు. హైదరాబాదు నగరంలోని పురాతన మెట్ల బావుల పునరుద్ధరణ కోసం సి.ఐ.ఐ.తో రాష్ట్ర పర్యాటక శాఖ హైదరాబాదులో నిన్న ఒప్పందం కుదుర్చుకున్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ..... ప్రస్తుతం పాత అసెంబ్లీ భవనాన్ని పునరుద్ధరిస్తామని, త్వరలోనే అందులో శాసన మండలి ఏర్పాటు చేస్తామని, జూబ్లి హాలు, ఉస్మానియా ఆస్పత్రి భవనం ..., హై కోర్టు భవనం వంటి కట్టడాలను పరిరక్షించవలసిన అవసరం ఉందని అన్నారు.

ఇదిలా వుండగా .... పురాతన మెట్ల బావులను పునరుద్ధరించి పర్యాటక ప్రాంతాలుగా తీర్చి దిద్దడానికీ పలువురు పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చారు. ప్రభుత్వ పాఠశాలలలో చదివే విద్యార్థులు ఉచితంగా పర్యాటక, చారిత్రక ప్రదేశాలను సందర్శించే అవకాశం కల్పిస్తున్నట్లు రేవంత్ రెడ్డి తెలిపారు.

---------------------------

ఆంధ్ర ప్రదేశ్ లో పాఠశాలలకు అక్టోబర్ 3 వ తేదీ నుండి దసరా సెలవులు ఇస్తున్నట్టు మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ ప్రకటించారు. వెలగపూడి సచివాలయంలో పాఠశాల విద్యపై జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన ఈ విషయం ప్రకటించారు. ఉపాధ్యాయులు ... వివిధ సంఘాల విజ్ఞప్తి మేరకు ఒక రోజు ముందుగానే దసరా సెలవులు.ఇస్తున్నామని ...., అక్టోబరు 13 వ తేదీ వరకు దసరా సెలవులు ఉంటాయని నారా లోకేష్ వివరించారు.

---------------------------

వారం వారం ప్రపంచవ్యాప్తంగా జరిగిన వార్తల విశేషాలు, వివిధ అంశాల సమాచారంతో అంతర్జాతీయ విషయాలన్నింటిని తెలుగులో అందించేందుకు ఆకాశవాణి విశాఖపట్నం ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన వసుధైక కుటుంబం ప్రత్యేక కార్యక్రమం ఈ రోజు ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

---------------------------

కేంద్ర గ్రామీణాభివృద్ధి .... కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్ర శేఖర్ నిన్న ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు నగరంలో భారీ వర్షాలు ...., వరదలకు గురైన ప్రాంతాలను పరిశీలించారు. శాసన సభ్యురాలు జి. మాధవి ...., ఇతర ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా చంద్ర శేఖర్ మాట్లాడుతూ .... నగరంలోని పలు ప్రాంతాలలో డ్రైనేజ్‌లపై వున్న ఆక్రమణలను తొలగిస్తే వరద ముంపు సమస్యకు పరిష్కారం లభిస్తుందని అన్నారు. అయితే ... అక్కడ వున్న పేదలకు ప్రత్యామ్నాయం చూపించిన తరువాతనే ఆక్రమణలు తొలగిస్తామని ....గుంటూరు నగరాన్ని పరిశుభ్రమైన నగరంగా తీర్చి దిద్దే లక్ష్యంతో ముందుకు వెడుతున్నామని డాక్టర్ చంద్ర శేఖర్ తెలిపారు.

---------------------------

హైదరాబాదు నగరంలో పోస్టర్లు..., బ్యానర్లు..., కటౌట్లను అతికించడంపై నగర మున్సిపల్ కార్పొరేషన్ నిషేధం విధించింది. గోడ పత్రికలతో పాటు గోడలపై రాతలను కూడా నిషేధించింది. ఈ మేరకు మున్సిపల్ కమిష నర్ ఆమ్రపాలి నిన్న ఉత్తర్వులు జారీ చేశారు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

---------------------------

ప్రపంచ తపాలా అవగాహనా దినం పురస్కరించుకుని అక్టోబర్ 9వ తేదీ నుండి వారం రోజుల పాటు జాతీయ తపాలా అవగాహనా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు విజయవాడ పోస్టు మాస్టర్ జనరల్ డి.వి ఎస్. మూర్తి తెలిపారు. విజయవాడలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ ... తపాలా వారోత్సవాలలో భాగంగా అక్టోబర్ 13 వ తేదీన గుంటూరులో 'తపాలా పరుగు' నిర్వహిస్తామని ..., కేంద్ర గ్రామీణాభివృద్ధి ...కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొంటారని మూర్తి తెలిపారు.

---------------------------

నవయుగ కవి చక్రవర్తి, అభ్యుదయ కవి గుర్రం జాషువా జయంతి ఈరోజు. సామాజిక ప్రయోజనం ఆశించి పలురచనలు చేసిన జాషువా గుంటూరు జిల్లా వినుకొండలో 1895 సెప్టెంబర్ 28వ తేదీన జన్మించారు. గుఱ్ఱం జాషువా సమాజం నుంచి అనేక అవహేళనలు, ఎదుర్కొంటూ తన కలానికి పదునుపెట్టి సాహిత్య రచన చేశారు. కుల,మతాల్లోని అనేక రుగ్మతలను ఖండిస్తూ తన కలం ద్వారా నిరంతరం జాతి పురోగమనాన్ని కాంక్షిస్తూ సంఘంలో ఉన్న అసమానతలు తొలగిపోవాలన్న ధృఢ సంకల్పంతో శక్తిమంతమైన కావ్యాలను, గబ్బిలం, ఫిరదౌసి, కాందిశీకుడు వంటి ఎన్నో గొప్పరచనాలతో సాహితీ జగత్తులో నవయుగ కవిచక్రవర్తిగా, కవి కోకిలగా ఎన్నో బిరుదులు, సన్మానాలు పొందారు.

---------------------------

కుక్క కాటు ద్వారా సంభవించే రెబీస్ వ్యాధి పట్ల అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో ఈ రోజు ప్రపంచ రెబిస్ అవగాహన దినం పాటిస్తున్నారు. రెబీస్ టీకాను కనుగొన్న ప్రముఖ శాస్త్రవేత్త లూయిస్ పాశ్చర్ వర్ధంతి సెప్టెంబర్ 28 వ తేదీని ప్రపంచ రెబీస్ దినంగా పాటిస్తున్నారు. రెబీస్ ఒక ప్రాణాంతక వ్యాధి. టీకాలు వేయని కుక్క కాటు ద్వారా మనుషులకు ఈ వ్యాధి సంక్రమిస్తుంది. అయితే.... రెబీస్ సోకిన వారు విజయవంతంగా బయటపడవచ్చు. కుక్క కాటుకు గురైన వారు వెంటనే ఆ ప్రదేశాన్ని శుభ్రం చేసి ... టీకా తీసుకున్న పక్షంలో సురక్షితంగా ఉండవచ్చు.

======================